క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: ఏడు వారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు బాల బాలాజీ ఆధ్వర్యంలోని అర్చకులు స్వామిని విశేషంగా అలంకరించారు. గ్రామంతో పాటు పడమరఖండ్రిక, కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. దూరపు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక మిటీ భోజన ప్రసాదాన్ని వడ్డించారు.

ఘనంగా విజయ దుర్గాంబిక జాతర

కపిలేశ్వరపురం: అంగర గ్రామ చేనేత కాలనీ సమీపంలోని విజయ దుర్గాంబిక అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద శుక్రవారం రాత్రి జాతర, శనివారం తీర్థం జరిగాయి. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల, విచిత్ర వేషధారణలతో జాతర సందడిగా సాగింది. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య అభ్యసించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు చిన్నారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య అభ్యసించాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో శనివారం ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపేట ఎస్సై కె.అప్పారావు, ఏఎస్సై కె.నాగార్జున, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రసాద్, ప్రొబేషన్ ఆఫీసర్ లక్ష్మీలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎటువంటి పనులకు వెళ్లకుండా స్వేచ్ఛగా చదువుకోవాలని అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. ఒకవేళ ఎవరికైనా స్వేచ్ఛగా చదువుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే చైల్డ్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణ పరిష్కారం చేస్తారని వివరించారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలోని సత్తెమ్మతల్లి ఆలయం ఏడో వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి అమ్మవారికి కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను చైర్ పర్సన్ దుర్గారాణి అభినందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వాలిన వీరబాబు, గురుస్వామి మేడిశెట్టి సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా రుద్రయాగం


ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో పంచాయతన మహా రుద్రయాగం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహా రుద్రయాగ కమిటీ శనివారం విలేకరులకు తెలిపింది. ఆ గ్రామంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23వ తేదీ వరకూ రుద్రయాగాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే యాగశాలలు తాత్కాలికంగా నిర్మించారు. ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన భారీ విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది.

ఆధార్ నవీకరణ శిబిరాలు సక్సెస్

- సాంకేతిక సమస్యల పరిష్కారం
- నాలుగు రోజుల పాటు శ్రమించిన సచివాలయ సిబ్బంది
- రెండు నియోజకవర్గాల్లో 1,606 మందికి రెన్యువల్
- వారిలో 1,033 మంది విద్యార్థులు


అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల్లో విద్యార్థిని ఐరిష్‌ను నవీకరిస్తున్న డీఏ మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: అన్నింటికీ ఆధారం ఆధార్ కార్డు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందాలన్నా, వ్యక్తికి కుటుంబానికి గుర్తింపునకు ఆధార్ కార్డు అత్యంత అవసరం. ఆధార్ కార్డుల్లోని సమాచారం తప్పులతో ఉండడమూ, వేలి ముద్రలు సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఆధార్ కార్డులను నవీకరించుకోవడం ద్వారా సాంకేతిక సమస్యలకు చెక్ పెట్టాలన్న తలంపుతో ప్రభుత్వం ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తూ ఇటీవల నిర్వహించిన శిబిరాలు విజయవంతమై సత్ఫలితాలు ఇచ్చాయి.

ఆధార్ శిబిరాల నిర్వహణ ప్రాధాన్యత ఇదీ...

గతంలో ఆధార్ నవీకరణ కోసం పలుమార్లు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ నెల 7 నుంచి నాలుగు రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయాలు, విద్యా సంస్థల్లోనూ నిర్వహించిన శిబిరాలు సాధారణ ప్రజలతో పాటు విద్యార్థుల వివరాలను నవీకరించేందుకు ఉద్దేశించినది. ఆధార్ పరంగా మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ అనుసంధానం, అడ్రస్ మార్పు, చేతి వేళ్ల, ఫొటో తదితర 10 రకాల నవీకరణ సేవలను అందించారు. విద్యార్థులకు పూర్తి ఉచితంగా ప్రభుత్వం ఈ సేవలను అందించింది.

రెండు నియోజకవర్గాల్లో నవీకరణ ఇలా...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ఆరు మండలాల పరిధిలో 1,606 మంది నవీకరణ చేసుకోగా వారిలో 1,033 మంది విద్యార్థులు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో నాలుగు రోజుల శిబిరాల్లో 1,113 మంది నవీకరణ చేయించుకోగా వారిలో 673 మంది విద్యార్థులు ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 493 మంది నవీకరణ చేయించుకోగా వారిలో 360 మంది విద్యార్థులు ఉన్నారు.

సేవలందించిన ఆధార్ కేంద్రాలివీ...

జిల్లాలో 48 సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సేవలందించగా 5,198 మంది తమ ఆధార్ వివరాలను నవీకరించుకోగా అందులో 3,006 మంది విద్యార్థులు ఉచితంగా సేవలు పొందారు. మిగిలిన వారు సాధారణ రూ.100 రుసుము చెల్లించి సేవలు పొందారు. మండపేట అర్బన్‌లో హరిజనపేట సచివాలయంలో 126 మందికి సేవలందించగా అందులో 86 మంది విద్యార్థుల వివరాలను ఉచితంగా నవీకరించారు. మండపేట రూరల్ మండలంలో తాపేశ్వరం–1, వెలగతోడు, ఏడిద–1 సచివాలయాల్లో 401 మందికి సేవలందించగా అందులో 368 మంది విద్యార్థులున్నారు. రాయవరం–1, వెదురుపాక సచివాలయాల్లో 257 మందికి గానూ 112 మంది విద్యార్థులున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని కపిలేశ్వరపురం 01, వల్లూరు సచివాలయాల్లో 329 మందికి గాను 107 మంది విద్యార్థులున్నారు. రామచంద్రపురం పట్టణంలోని చప్పిడివారి సావరం, వైఎస్సార్ నగర్‌లలో 277 మందికి గానూ 271 మంది విద్యార్థులున్నారు. కె.గంగవరం మండలంలోని సత్యవాడ, కూళ్ళ సచివాలయాల్లో 216 మందికి ఆధార్ నవీకరణ చేయగా అందులో 89 మంది విద్యార్థులు ఉచితంగా సేవలు పొందారు.

విద్యార్థుల స్పందన బావుంది



ఈ నెల 7 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిబిరాల్లో విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. చేతివేలి ముద్రలు, ఫొటో, అడ్రస్ తదితర వివరాలను నవీకరించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన శిబిరాలు మంచి ఫలితాలు ఇచ్చాయి.

– ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్, కపిలేశ్వరపురం

వివాహ వేడుకకు హాజరైన మంత్రి వేణు


రాజమహేంద్రవరంలో వధూవరులు నిఖిల్ కృష్ణ, దివ్య దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతుల కుమారుడు నిఖిల్‌కృష్ణ–దివ్యల వివాహం రాజమహేంద్రవరంలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం వైభవంగా జరిగింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వివాహానికి హాజరై వధూవరులు నిఖిల్‌కృష్ణ, దివ్యలను ఆశీర్వదించారు.

కైలాస భూమి బాగు చేసుకునేందుకు విరాళాలు


కైలాస భూమిని సందర్శించిన నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో కైలాసభూమి అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని న్యాయవాది మాగాపు అమ్మిరాజు అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శనివారం కై లాస భూమిని సందర్శించారు. రాత్రి పూట లైటింగ్ ఏర్పాటు, స్నానం ఆచరించడానికి కుళాయిల ఏర్పాటు తదితర అభివృద్ధికి ఇటీవల మృతి చెందిన ఆళ్ల రామం పేరున వారి కుటుంబ సభ్యులు రూ. 50 వేలు, తోటపేటకు చెందిన అల్లం కృష్ణమూర్తి పేరిట ఆయన మనవడు ప్రసాద్ రూ.10 వేల విరాళం ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, మాజీ ఉప సర్పంచ్ నామా వెంకన్నబాబు, వార్డు సభ్యులు యండమూరి ఈశ్వరరావు, సాక్షి పద్మనాభం, డేగల వెంకటరమణ, కొసనా భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

రథసారథులు మీరే..


గృహసారథులతో కలసి ర్యాలీలో పాల్గొన్న మంత్రి వేణు, పరిశీలకులు రఘురాం తదితరులు

- ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వాములు కండి
- గృహ సారథులకు మంత్రి వేణు పిలుపు

రామచంద్రపురం: పేదరికంపై సంక్షేమ పథకాలతో యుద్ధం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రథ సారథులు మీరేనని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు గృహసారథులు భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో శనివారం పట్టణంలోని 28 వార్డులకు చెందిన నూతనంగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే సంకల్పంతోనే గృహసారథులను నియమించారని మంత్రి వేణు వివరించారు. సచివాలయ పరిధిలోఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా గృహసారథులు చూడాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రగతిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. ఈ సందర్భంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి సమావేశం వద్ద నుంచి రత్నంపేట మున్సిపాలిటీ స్కూల్ వరకు మంత్రి వేణు ర్యాలీ చేశారు. పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా జరిగిన అభివృద్ధిని గృహసారథులు, కన్వీనర్లకు వివరించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి వేణు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురాం, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్‌చైర్మన్‌లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా నరజాడ రహదారి


అధ్వానంగా మారిన నరజాడ–అముజూరు రహదారి

కె.గంగవరం: మండలంలోని అముజూరు–నరజాడ రహదారి అధ్వానంగా మారింది. పక్కనే పంట కాలువ ఉండడం వల్ల రోడ్డు కోతకు గురైంది. మరోవైపు సుమారు 4 కిలోమీటర్లు ఉండే ఈ రహదారిలో ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి మరీ అధ్వానంగా మారింది. కూళ్ల మల్లవరం, నరజాడ గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారినే నియోగిస్తుంటారు. ఈ రహదారి సరిలేకపోవడంతో రోజు ఈ గ్రామం నుంచి వాకతిప్ప వెళ్లే బస్సు కూడా రావడం లేదని దీంతో నానాఅవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం


సాయిశంకర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అయ్యప్ప

కాజులూరు: గొల్లపాలెంలో రోడ్డు ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని తీవ్ర అవస్థలు పడుతున్న కోలా సాయిశంకర్ కుటుంబీకులకు స్థానిక తోట త్రిమూర్తులు ఫాలోవర్స్ యువజన సంఘం అధ్యక్షుడు ఆకుల అయ్యప్ప తదితరులు ఆర్థిక సహకారం అందజేశారు. గ్రామానికి చెందిన కోలా సాయిశంకర్ గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురవగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి ఆసుపత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేయించగా రూ.ఐదు లక్షలు ఖర్చయింది. విషయం తెలుసుకున్న ఆకుల అయ్యప్ప తన మిత్రుల సహకారంతో రూ.50 వేలు విరాళం పోగుచేసి శనివారం బాధితుని కుటుంబీకులకు అందజేశారు.

కుష్ఠు లక్షణాలు ప్రాథమిక దశలోనే గుర్తించాలి


వ్యాధిగ్రస్తులకు ప్లేట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి భరతలక్ష్మి తదితరులు

కె.గంగవరం: కుష్ఠు వ్యాధి లక్షణాలు ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని జిల్లా అడిషనల్ వైద్యాధికారి భరతలక్ష్మి అన్నారు. మండలంలోని పామర్రు పీహెచ్‌సీ వద్ద శనివారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు టి.మాణిక్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అడిషనల్ జిల్లా వైద్యాధికారి పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. అనంతరం తామరపల్లికి చెందిన తోకల శ్రీను ఇతర దాతల సహకారంతో వ్యాధిగ్రస్తులకు స్టీల్ ప్లేట్లు, పండ్లు, పౌష్టికాహారం అందించారు. డీపీఎంఓ ఎం.వెంకటేశ్వర్లు, వైద్యులు పార్వతి, సూపర్‌వైజర్ మల్లికార్జునుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 562 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత

రామచంద్రపురం: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్‌అదాలత్‌లో 562 కేసులు పరిష్కరించారు. మూడు బెంచ్‌ల ద్వారా ఈ కేసులను విచారించారు. మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీలత, బెంచ్ మెంబర్ బి.సురేష్‌కుమార్, 2వ బెంచ్ నందు జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ, బెంచ్ మెంబర్ ఎస్.సత్యగోపీ, మూడవ బెంచ్ నందు ఏజేఎఫ్‌సీఎం జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్, బెంచ్ మెంబర్ డి.సత్యనారాయణలు కేసులను విచారించారు. ఇందులో రూ.82,10,493ల విలువ చేసే సివిల్ కేసులు 18, క్రిమినల్ కేసులు 539, మున్సిపాలిటీ పీఎల్‌సీ 5 కేసులను పరిష్కరించారు. కోర్టు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం


పాడి రైతులకు మినరల్ మిక్చర్ తదితర మందులను అందజేస్తున్న మేనేజర్, సర్పంచ్, పశు వైద్యాధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెం గ్రామంలో ఫుల్లెర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ (గ్రామశక్తి) ఆధ్వర్యంలో ×పశు వికాశ్॥ ఉచిత పశు వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పలివెల లోవరాజు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ శిబిరంలో పశు సంవర్థక శాఖ ఏడీ ఒ.రామకృష్ణ నేతృత్వంలో వెల్ల, ద్రాక్షారామ, నరసాపురపుపేట పశు వైద్యాధికారులు రామచంద్రరావు, కృష్ణార్జున్, సంయుక్తలక్ష్మి 94 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ద్రాక్షారామ ల్యాబ్ టెక్నీషియన్ మల్లేశ్వరి పేడ, మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఫుల్లెర్టన్ బ్రాంచ్ మేనేజర్ కశిరెడ్డి శివరామకృష్ణ, సర్పంచ్ లోవరాజు, పశు వైద్యాధికారుల చేతుల మీదుగా రూ.10 వేలు విలువ చేసే మినరల్ మిక్చర్, కాల్షియం, గర్భకోశ వ్యాధి మందులు 54 మంది రైతులకు అందజేశారు. వీరబ్యాక్ మెడికల్ కంపెనీ ఆధ్వర్యంలో పశువుల అన్నింటికీ డీవార్మింగ్ పంపిణీ చేశారు.

వీహెచ్‌యూ వీసీగా బాబ్జీ ఎంపికపై హర్షం

కాజులూరు: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ(వీహెచ్‌యూ) వైస్ చాన్సలర్ (వీసీ)గా ప్రముఖ న్యూరో సర్జన్ కోరుకొండ బాబ్జి ఎంపిక కావటంపై మండల గ్రామాలకు చెందిన పలువురు స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శీలకు చెందిన డాక్టర్ కోరుకొండ బాబ్జి వైద్యవృత్తిలో సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించటంతో పాటు కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల పిన్సిపాల్‌గా పని చేశారు. మెడికల్ క్యాంపుల ద్వారా మండల గ్రామాల్లోని ప్రజలకు విశేష సేవలందించటంతో పాటు పలువురు పేద విద్యార్థులకు తోడ్పాటు నందించారు. తాజాగా డాక్టర్ బాబ్జి వీహెచ్‌యూ వీసీగా ఎంపిక కావటంపై ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, స్థానిక నాయకులు దాస్యం సుమన్, నల్లమిల్లి రామారెడ్డి, మాత నూకరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పీఎంపీ అచ్చిరాజు మృతి



మండపేట: పట్టణంలో పేదల వైద్యుడిగా పేరుగాంచిన పీఎంపీ ఉప్పలపాటి అచ్చిరాజు (72) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత 50 ఏళ్లుగా స్థానిక సైదులుపేటలో పేదలకు వైద్యం అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. ఆయన మృతికి పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, సంఘ నాయకులు బళ్లా వెంకటరమణ, వానపల్లి కనకరాజు, మండిపూడి చంద్రశేఖర్, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

టి.మామిడాడ రహదారిని పునర్నిర్మించాలి

కాజులూరు: మండలంలోని టి.మామిడాడ రహదారి శిథిలావస్థకు చేరుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సుమారు 12 సంవత్సరాల క్రితం నాబార్డు నిధుల రూ.70 లక్షలతో జగన్నాథగిరి, ఆర్యావటం మధ్య తర్లంపూడి, టి.మామిడాడ మీదుగా రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన కొన్ని నెలలకే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు కొన్నాళ్ల క్రితం నిధులు మంజూరవగా ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టినప్పటికీ అవి తూతూమంత్రగా జరగడంతో ఎక్కడి గోతులు అక్కడే మిగిలిపోయాయి. ఈ రహదారిపై వాహనాలు నడపాలంటే తీవ్ర ఇబ్బందికరంగా మారిందని రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మాజీ సర్పంచ్‌లు వై.పోతురాజు, నురుకుర్తి శ్రీనివాసు, స్థానిక నాయకులు అనసూరి శివన్నారాయణ, అనసూరి శ్రీనివాసు, రాంబాబు తదితరులు కోరుతున్నారు.

కోటి ఫలితాల పుణ్యక్షేత్రం

- కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వరుడు
- చురుగ్గా సాగుతున్న శివరాత్రి ఏర్పాట్లు


కోటిపల్లిలో ఛాయా సోమేశ్వరాలయం



కె.గంగవరం: కోరుకున్న కోరికలకు కోటి ఫలితాలిచ్చే వరాల కేంద్రంగా కోటిపల్లిలోని ఉన్న శ్రీఛాయా సోమేశ్వరాలయం విరాజిల్లుతుంది. గోదావరి ఏటిగట్టున చంద్ర ప్రతిష్ఠిత సోమేశ్వరుని ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యటకేంద్రంగా కూడా భాసిల్లుతుంది. గౌతమీ గోదావరి ఒడ్డున ఉన్న కోటిపల్లిలో వేంచేసిన ఛాయా సోమేశ్వరున్ని రోజూ పర్యాటకులు, భక్తులు సందర్శిస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వయంభూ లింగమైన స్వామిని దర్శించుకుని పూజలు చేస్తారు. గోదావరిలో స్నానమాచరించి సోమేశ్వరుని దర్శించుకుంటే కోటిఫలితాలు వస్తాయని ప్రతీతి. అందుకే జిల్లాను సందర్శించిన చాలామంది భక్తుల ఇక్కడకు వస్తుంటారు. మహాశివరాత్రి రోజున రాత్రికి ఆలయం గోపురంపై స్వామికి ప్రత్యేక పూజలు చేసి కోటి దీపాలను వెలిగించటం ఇక్కడ ప్రత్యేకత.

ఈ ఆలయ ప్రత్యేకత ఏమిటంటే..

పవిత్ర గౌతమి గోదావరి నది ఒడ్డున వెలసిన పుణ్యక్షేత్రం కోటిపల్లి. అష్టసోమేశ్వర ఆలయాల్లో ఇది ఒకటి. ఈ ఆలయంలో పరమశివుడు అత్యంత చిన్న లింగాకారంలో వెలశాడు. ఈ పుణ్యక్షేత్రంలో కుక్కటేశ్వరస్వామి, ఛాయాసోమేశ్వరస్వామి, సిద్ధిజనార్దనస్వామి ఆలయాలు ఉన్నాయి. చంద్రుడు గురుపత్నిని మోహించిన కారణంగా గురువు శాపానికి గురై ఛాయను కోల్పోతాడు. అతనికి శాప విమోచనంగా గోదావరి నది ఒడ్డున శివలింగం ప్రతిష్ఠ చేస్తే కోల్పోయిన ఛాయను పొందవచ్చని గురువు సూచిస్తాడు. దీంతో చంద్రుడు పవిత్ర గోదావరిలో స్నానమాచరించి శివలింగాన్ని ప్రతిష్ఠించి కోల్పోయిన ఛాయను తిరిగి పొందుతాడు. దీంతో ఇక్కడ పరమేశ్వరుని ఛాయసోమేశ్వరస్వామిగా పిలుస్తుంటారు.

మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

ఈ నెల 18న జరిగే మహాశివరాత్రి రోజున ఆలయం వద్ద భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా టెంట్లు ఏర్పాటు చేస్తాం. క్యూలో భక్తులకు తాగునీటి సౌకర్యం అందిస్తాం. ఆలయం లోపల స్వచ్ఛంద సంస్థల సహకారంతో చెత్తాచెదారం, చిత్తు కాగితాలు లేకుండా చేస్తాం. మరుదుదొడ్లు, భక్తులకు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తాం.

– జె.రామలింగేశ్వరరావు, ఈఓ, కోటిపల్లి

చిన్నారుల్లో వ్యాధుల గుర్తింపునకు సర్వే


పడమర ఖండ్రిక పాఠశాల్లో విద్యార్థుల వివరాలను తెలుసుకుంటున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: చిన్నారుల్లో పుట్టుకతో కానీ, తర్వాత కాలంలో కాని తలెత్తే ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు ఉద్దేశించిన సర్వేను మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో శనివారం నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ పి.సురేష్ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వే చేశారు. చిన్నారుల జీవన పద్ధతులను అడిగి తెలుసుకుని వివరాలను నమోదు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, డాక్టర్ జె.అనూజ ప్రియాంక మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాలపై ఎల్‌సీడీసీ (స్పర్శ అవగాహన) కార్యక్రమంలో భాగంగా చిన్నారులను పరిశీలిస్తున్నామన్నారు. కుష్ఠు వ్యాధి మచ్చలు కనిపిస్తే సంబంధిత వైద్య విభాగ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. విద్యార్థుల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని 3–19 వయస్సు గల చిన్నారులను ఆరోగ్య వివరాలను పరిశీలిస్తున్నట్టు వారు తెలిపారు.

అలరించిన బాలికల కోలాటం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం 200 మంది బాలికలు కలిసి చేసిన సంప్రదాయ కోలాట ప్రదర్శన అందరినీ అలరించింది. తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కోలాట భజన మండలి ఈ సంప్రదాయ ప్రదర్శన నిర్వహించింది. కోలాట గురువు ఆండ్రు సురేష్‌బాబు పర్యవేక్షణలో 200 మంది బాలికలు ఒకేసారి చేసిన కోలాటం లయబద్ధమైన సంప్రదాయ గీతాలు, నృత్యాలతో సాగింది.